వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 14 జనవరి 2025

## వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ఒంటిమిట్ట జనవరి13 ప్రభాతవార్త:



స్ధానిక కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున ఆలయంలో సీతారాములకల్యాణం నిర్వహిస్తారు. అందులో బాగంగా సోమవారం స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయం అర్చకులు వీణరాఘవాచార్యులు. శ్రవన్‌కుమార్, మనోజ్‌కుమార్‌లు ఉత్సవ మూర్తులకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఆలంకరించి కాల్యాణ వేదిక పై ఆశీనులను చేశారు. సరిగ్గా 10గంటలకు ఉత్సవ మూర్తులపై జిలకరా బెల్లం ఆమర్చారు. తరువాత మాంగల్యాదారణ కార్య క్రమం నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని విక్షించేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా టిటిడి ఆదికారులు తగిన ఏర్పట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆదికారులు, భక్తులు పాల్గోన్నారు.

## అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

### జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి జనవరి 13 ప్రభాతవార్త



జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు, ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సంక్రాంతి,కనుమ శుభాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ పండుగ అందరి జీవితాలలో ఆనందం, శాంతిని నింపాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ పండుగ మీకు, మీ కుటుంబ సభ్యులకు, సంతోషాలను నింపాలని. అలాగే, పండుగ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్నమయ్య జిల్లా పోలీస్‌శాఖ అందరికీ అండగా ఉంటుందని,శాంతిభద్రతలకు అన్నమయ్య పోలీస్ కట్టుబడి ఉంటుందని ఎస్పీ పేర్కోన్నారు.

# ఫ్రీ హోల్డ్ పై ప్రభుత్వ స్పష్టత ఉన్నట్లా.. లేనట్లా?

- ఐదు నెలలు పై పడుతున్న ఫ్రీ హోల్డ్ పై రిజిస్టర్ కార్యాలయంలో కాని రిజిస్టర్లు అవస్థల్లో రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- ఫ్రీ హోల్డ్ భూముల పై కోట్లాది రూపాయల పెట్టుబడులు ఆగిన వైనం
- ఆ భూములపై పోలీస్ స్టేషన్లో రోజు పంచాయతీలో పంచాయతీలు

రాయచోటి జనవరి 13 ప్రభాతవార్త



అప్పటి ప్రభుత్వం రాయచోటిని అన్నమయ్య జిల్లా చేయడంతో రాయచోటి దరిదాపుల్లోని భూములన్నీ ఒక్కసారిగా అధిక ధరలతో తుఫాన్ లాగా పెరిగిపోవడం జరిగింది చుట్టుపక్కల సుమారు పది కిలోమీటర్ల వరకు కోట్లాది రూపాయలు వచ్చింది భూములను కొనుగోలు చేయడం జరిగింది ఈ భూములు జిల్లా ఆయన కొద్ది రోజుల్లో అరకుడగా వ్యాపారం అయినప్పటికీ తర్వాత రియల్ ఎస్టేట్ ఒకసారిగా కుప్పకూలిపోయింది. దీంతో రైతుల వద్ద నుంచి పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేసిన భూములు కొనుగోలుదారులు ఉంచుకుంటారా లేక తిరిగి రైతులకు ఇస్తారా అన్నది కొట్టుమిట్టాడుతున్నారు. అంతేకాకుండా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక జీవోను ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు క్రితం నుంచి ఉన్న బ్బురములను ఫ్రీ హోల్డ్ కింద చేర్చి ఆ భూములను రైతులకు రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చింది ఏ నేపథ్యంలో కొందరు హుటాహుటిన రైతులు ఫ్రీ హోల్ భూములను రిజిస్టర్ చేసుకోవడం కూడా జరిగింది మరికొందరేమో రిజిస్టర్లు చేసుకునే సమయానికి ప్రభుత్వం మారిపోవడంతో ఈ ఫ్రీహోల్డ్ భూములను రిజిస్టర్‌లు కాకుండా ఆపివేయడం జరిగింది.. దీంతో రైతుల వద్ద నుంచి ఫ్రీ ఓల్డ్ భూములను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఒకసారిగా కుప్ప కూలిపోయారు అయితే టిడిపి ప్రభుత్వం ఈ భూములను సర్వే చేయించి అనంతరం ఈస్టర్లు చేస్తామని దాదాపుగా ఐదు నెలల పైబడి కాలయాపన చేస్తూ ఉండడంతో అప్పోసప్ప తెచ్చి ఫ్రీ హోల్డ్ భూములను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వారు ఈ భూములు ఎటు కాకుండా మధ్యలోనే నిలిచిపోవడంతో భూములు రైతులే తీసుకుంటారా లేదా రైతులకు తీసుకున్న డబ్బులను తిరిగి వ్యాపారస్తులకు ఇస్తారా అన్నదే సందిగ్ధంగా మారింది. ఇప్పుడు ఆల్బమ్ లో రిజిస్టర్ కాకపోవడంతో తమ డబ్బులు తమకు వెనక్కి విచ్చేయాలంటూ రైతులపై వ్యాపారస్తులు రోజు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకుంటున్నారు. కానీ ప్రభుత్వం ఐదు నెలలవుతున్న ఇలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అటు రిజిస్టర్ కార్యాలయంలో భూములను రిజిస్టర్ కాకుండా ఆపి వేయడంతో ప్రభుత్వానికి నష్టమేనని ఇటు రైతులకు వ్యాపారస్తులకు కూడా ఏం చేయాలన్న సందీప్దంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏది ఏమైనా ఫ్రీ హోల్డ్ భూములపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంతవరకు వేచి చూడాల్సిందేనని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో పాటు రైతులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

## రాజంపేట సబ్ డివిజన్‌కు ఐపీఎస్ అధికారి

### ఏఎస్‌పి స్థాయి అధికారి నియామకంపై సర్వత్రా ఆసక్తి

రాజంపేట అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:



రాజంపేట పోలీస్ సబ్ డివిజన్‌కు ఐపీఎస్ అధికారిని 'బాస్'గా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 సబ్ డివిజన్‌లకు ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా రాయలసీమలో రాజకీయ పరిణామాలు ఆసక్తి కరంగానూ, వివాదాస్పదం గానూ ఉండే అనంతపురం జిల్లా తాడిపత్రి, నంద్యాలతో పాటు కాకినాడ, చింతపల్లి సబ్ డివిజన్‌లకు కూడ ఐపీఎస్ అధికారులనే నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్ జీవో ఆర్టి నెంబర్ 75జారీ సోమవారం జారీ చేశారు. అందులో భాగంగా గ్రేహౌన్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్న 2022బ్యాచ్ ఐపీఎస్ అధికారి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేను నియమించారు. దీంతో ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న నాంపల్లె సుధాకర్ బదిలీ అనివార్యం అని తెలుస్తోంది. కాదంటే ఏఎస్‌పీ స్థాయి అధికారి పనిచేస్తున్న నేపథ్యంలో ఆయన పరిధిలోనే డీఎస్పీని కొనసాగించే అవకాశాలు లేవని తెలుస్తోంది. దీనికి తోడు ఐపీఎస్ నియామక ఉత్తర్వుల్లో పోస్ట్ వేకన్సీ ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే రానున్న రోజుల్లో ఐపీఎస్ అధికారి మాత్రమే సబ్ డివిజన్‌కు బాస్‌గా పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపోతే ఐపీఎస్ అధికారి నియామకం వెనుక పలు కారణాలు వినిపిస్తున్నాయి. గతంలో ఉమ్మడి కడప జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాతినిధ్యం వహించే పులివెందులలో ఐపీఎస్ అధికారులను నియమించారు. జమ్మలమడుగులో కూడ ఐపీఎస్ అధికారిణి నియమించారు. తాజాగా రాజంపేటకు ఐపీఎస్ అధికారిని కూడ ఆ విధంగానే నియమిస్తూ ప్రత్యేక జీవో జారీ అయినట్లు తెలుస్తోంది. రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోనే వీరబల్లె, సుండుపల్లె, అటవీ ప్రాంతాలతో పాటు చిట్వేలి, రాజంపేట, పుల్లంపేట, ఓబుళవారి పల్లె, రైల్వేకోడూరు మండలాల్లో వేల కోట్ల విలువైన ఎర్రచందనం సంపద ఉంది. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కట్టడి చేసేందుకు కూడ ఐపీఎస్ అధికారిని నియమించి ఉండవచ్చని తెలుస్తోంది. ఎందుకంటే రాజంపేట సబ్ డివిజన్ మిగతా సబ్ డివిజన్‌లతో పోల్చితే శాంతి భద్రతల పరంగా ప్రశాంతంగానే ఉంటుంది. ఇకపోతే ఐపీఎస్ అధికారి అయితే రాజకీయంగా ఒత్తిడి చాలా వరకు ఉండదనేది పోలీస్ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం. ఇప్పటికే జిల్లా కేంద్రమైన రాయచోటిలో కూడ ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఉంటారు. దీంతో జిల్లాలో ముగ్గురు ఐపీఎస్ అధికారులు పనిచేయనున్నారు. తాజాగా రాజంపేట డీఎస్పీ పనితీరుపై కూడ ప్రభుత్వం నిఘా వర్గాల ద్వారా సమాచారాన్ని సేకరించింది. సివిల్ పంచాయతీలు పెద్దఎత్తున కేసుల సెటిల్‌మెంట్‌లో లక్షలు చేతులు మారినట్లు నిఘా వర్గాలు సమాచారం సేకరించాయి. ఈ నేపథ్యంలోనే రాజంపేటకు కూడ ఐపీఎస్ అధికారిణి నియమించారని తెలుస్తోంది.

# గ్రామ సీమల్లో మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

రాజంపేట అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:



తెలుగు లోగిళ్లలో అతి ముఖ్యమైన పెద్ద పండుగగా 3రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి సంబరాలు మొదటి రోజే పల్లెల్లో సందడి కనిపించింది. తెల్లవారు జామునే భోగి మంటలు పల్లె సీమల్లో గ్రామాలకు వెలుగు నిచ్చాయి. భోగి మంటల్లో పెద్ద ఎత్తున చిన్నా పెద్ద లేకుండా పాల్గొన్నారు. ముందురోజు రాత్రి నుంచే మహిళలు తమ కళానైపుణ్యాన్ని రంగువల్లులను వేసి ఇంటికి కళను తీసుకువచ్చారు. రంగ వల్లుల ముందే భోగి మంటలు వేశారు. సాంప్రదాయ బద్ధంగా తెల్లవారు జామునే హరిదాసు కీర్తనలు గ్రామాల్లో అక్కడక్కడ కనిపించాయి. సాంప్రదాయ కోడి పందాలను చూడ ముచ్చటగా బంధుమిత్రులతో సరదాగా ఆడుకున్నారు. రాజంపేట పట్టణంలో మెహర్ బాబా వీధిలో గ్రామీణ నేపథ్యం ఉన్న వారు ఎక్కువగా ఉండటంతో వీధంతా ఒక్కటే చోట భోగి మంటలను వేసి పల్లెల్లో తరహాలో భోగి మంటల చుట్టు గొబ్బియలు ఆడారు. భోగి మంటలకు పూజలు చేశారు. పల్లెకు పోకపోయిన భోగి మంటల కార్యక్రమానికి అందరూ హాజరు కావడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆకేపాడులో ఎద్దులచే బండలాగుడు పోటీలు అలరించాయి. పలు చోట్ల గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మరి కొన్ని చోట్ల ఎద్దుల బండ్ల పోటీలను నిర్వహించారు. నేటి సంక్రాంతికి గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. సంక్రాంతి పండుగతో పల్లెలు కళకళలాడుతుండగా పట్టణాలు ఖాళీ అయ్యాయి. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణ శాస్త్రి పేర్కొన్నట్లు 'పల్లె తల్లి వంటిది, పట్టణం ప్రియురాలి వంటిది' అన్న నానుడి నిజమైంది. ఏనాడైన పుట్టిన గడ్డ పల్లెనే కాబట్టి అందరూ అక్కడికే చేరారు. దీంతో గ్రామాల్లో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు హోరెత్తుతున్నాయి. ప్రతి ఇంట సంతోషం వెల్లివెరుస్తోంది.

సంక్రాంతి సంబరాలలో...





## మదనపల్లి మెడికల్ కాలేజీ ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

మదనపల్లి జనవరి 13 ప్రభాతవార్త




సర్వజన బోధనాసుపత్రిని పెయివేట్ పరం కాకుండా కాపాడుకోవడం ప్రజల భాద్యత అని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మదనపల్లి సర్వజన బోధన ఆసుపత్రి ముందు సిపిఎం ఆధ్వర్యంలో సిబ్బంది బదిలీలను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. మదనపల్లి మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బంది బదిలీలు రద్దు చెయ్యాలని, ధర్మాసుపత్రిని కాపాడుకుందాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకో వలన పటేల్ రోడ్డు పై వాహనాలు ఆగిపోవాడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్సలు అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. పీలేరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గ ప్రజలతో పాటు కర్ణాటక ప్రాంత ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి వైద్యం చేయించుకుంటారన్నారు. రోజుకు 1,200 నుంచి 1,500 మంది అవుట్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందుతున్నారని, మదనపల్లి ధర్మాసుపత్రి గా పేరుగాంచిన ప్రభుత్వ ఆసుపత్రిని గత ప్రభుత్వం జిల్లా ఆసుపత్రిగా, తర్వాత రోజుల్లో సర్వజన బోధనాసుపత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలందరూ హర్షించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, ఇక్కడున్న ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 44 మంది వైద్యులను, మరో 24 మంది స్టాఫ్ నర్స్ లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సర్వజన బోధనా ఆసుపత్రి వల్ల మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం వస్తుందని, దూర ప్రాంతాలకు వెళ్లడం, సకాలంలో వైద్యం అందక చనిపోవడం లాంటి బాధల నుండి విముక్తి ఉంటుందని భావించిన ప్రజలపై కూటమి ప్రభుత్వం పిడుగు వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోధనా ఆసుపత్రిని కాపాడుకోవడానికి ప్రజలు అందరూ ఐక్యంగా పోరాటం చెయ్యాలని సిపిఎం ప్రారంభం చేసిన ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు ప్రభాకర్, ప్రముఖ న్యాయవాది సోమశేఖర్, ఆలం నాయకులు నూరుల్లా, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నరసింహులు మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో పేదలను వివిధ రకాల పరీక్షల పేరిట దోచుకుంటున్నారన్నారని, పేదలకు అండగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ని కూడా ప్రైవేటుపరమైతే ఇక సామాన్యుడు వైద్యం చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సర్వజన బోధన ఆసుపత్రి గానే ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రఘునాథ్, మునివేంకటప్ప, నారాయణ, పవన్, ఆటో యూనియన్ నాయకులు నావాజ్, రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సంక్రాంతి అంటేనే సంబరాలు..

# సంబరాలు అంటేనే సంక్రాంతి

### ఇంటికి బంధువులు ఒంటిపై నూతన వస్త్రాలు.. రకరకాల పిండి వంటలు

రాయచోటి జనవరి 13 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో ఏడాది సంక్రాంతి పండుగను అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు గత కొంతకాలంగా ఈ సంక్రాంతిని అరకొరగా చేసుకునే వారిని ప్రస్తుత తరుణంలో పండుగలపై గ్రామీణ ప్రాంతాల సైతం ప్రజలకు మక్కువ ఉండడంతో పండగలపై దృష్టి సారించారు దీంతో ఏడాది సంక్రాంతి పండుగను ఇంటికి బంధువులను అదే ఇంటిలో పిండివంటలు జోరుగా అవుతున్నాయి. ఇప్పటికే తమ బంధువులు హైదరాబాద్ చెన్నై తమిళనాడు విజయవాడ తదితర ప్రాంతాల నుంచి ఇండ్లకు చేరుకుని పండుగలో నిమగ్నమయ్యారు. సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకోగా నేడు సంక్రాంతి అదే విధంగా బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామీణ ప్రాంతాలలో కూడా చిట్లా కుప్పలు ఇప్పటికే చెత్తను ఏర్పాటు చేసుకొని కుప్పలు వేయడం కూడా జరిగింది. రకరకాల పిండివంటలతో ఇంటిలోని బంధుమిత్రులతో కలిసి ఈ పండుగను గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా చేసుకునేందుకు ఇంటికి వచ్చిన బంధుమిత్రులు తోనే చూస్తుంటే తెలుస్తోంది అని చెప్పవచ్చు.



# ఘనంగా భోగి వేడుకలు

వేంపల్లి, జనవరి 13, ప్రభాతవార్త :

పులివెందుల లోని శిల్పారామం, డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెళ్ల లేక్ ఫ్రంట్‌ల లో భోగి పండుగ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉలిమెళ్ల లేక్ ఫ్రంట్ లో మానస్ డాన్స్ అకాడమీ చిన్నారులచే నిర్వహించు కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు, బ్రహ్మాంజలి, దేవాది దేవా గణపతి దేవా మొదలగు పాటలకు నృత్య ప్రదర్శన చేశారు. ఈ పాటలు ప్రేక్షకులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి, సాయంత్రం భోగిమంటల్లో చెట్టు బెరడులు, పాత కలప వేసి, ఆవు పేడతో చేసిన పిడకలను భోగి దండలుగా గుచ్చి భోగి మంటల్లో వేసి ఘనంగా భోగి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి బి. సుధాకర్ మరియు సీనియర్ అసిస్టెంట్ బి. వరప్రసాద్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. శిల్పారామం లో కూరగాయల యన్. నాగేంద్ర ప్రసాద్, ఎంజిఎస్ వెజిటబుల్ మార్కెట్ సహకారంతో ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు ఉపేంద్రచే ఇంద్రజాల ప్రదర్శన ప్రేక్షకులకు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో గొడుగు మాయం చేయడం, మెడలోపలికి కత్తి దింపడం, కోడిగుడ్లు నోట్లు, చెవిలో నుంచి తీయడం, బ్లేడ్స్ మింగి దారంతో లాగడం, డబ్బాలో వాటర్ పోసి ఫ్లవర్స్ తీయడం, రిబ్బన్లు తీయడం, చేంజింగ్ బ్యాగ్ తో హాస్యం ప్రదర్శించడం తదితర ఐటమ్స్ తో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల నాగేంద్ర ప్రసాద్, పరిపాలన అధికారి బి. సుధాకర్, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.




## బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో అష్టావధానం

బద్వేల్ అర్బన్, జనవరి 13, ప్రభాత వార్త

సంక్రాంతి సంబరాలలో భాగంగా బద్దెనకరాపేట ఆధ్వర్యంలో అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు కళాకారుల నుంచి విశేష స్పందన లభించింది. అష్టావధానం అనేది ఒక గమ్మత్తైన ప్రక్రియ అని, తెలుగు గురించి లోతుగా తెలిసిన ప్రతి ఒక్కరికి ఈ ప్రక్రియ ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందనే విషయం మనందరికీ తెలిసిందేనని కళా పీఠం సభ్యులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అవధాని ఎలవర్తి మధుసూదన ఆధ్వర్యంలో కన్నుల పండుగగా సంగీత అవధానం నిర్వహించారు. అన్నమయ్య కీర్తనను కోటపాటి ఓబులేసు , సుమతి శతక పద్యాన్ని చింతంరెడ్డి రామచంద్రారెడ్డి , వేమన పద్యాన్ని బలపనూరు శంభో ప్రసాద్, నారసింహ శతక పద్యాన్ని మురా సుధాకర్ లు అవదానిని కోరగా వారు కోరిన రీతిలో వారికి అవదాని ఎలమర్తి మధుసూదన్ పాడుతూ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు మండల అభివృద్ధి అధికారి దుంపల మల్లేశ్వరి, కళాపీఠం గౌరవాధ్యక్షులు కేవీ సుబ్బారెడ్డి , పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కళాపీఠం ఉపాధ్యక్షులు సివి నాగేశ్వరరావు, వాకమల్ల రాఘవరెడ్డి, కోశాధికారి మన్నేపల్లి రాజయ్య గోనుగుంట వెంకట సుబ్బారెడ్డి, వాకారామయ్య, పి.వి. సుబ్రహ్మణ్యం, శీలి వెంకటసుబ్బయ్య, ఎం వెంకటసుబ్బయ్య, బోధన బోయిన మల్లికార్జునరావు ఆవుల శ్రీనివాసరావు, పెన్షనర్స్ సభ్యులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఓ వరం

మదనపల్లి జనవరి 13 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే షాజహాన్ బాషాగారు అన్నారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 20 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని లబ్ధిదారులైన చంద్ర, తులశమ్మ, నసీబ్ జాన్ నర్సింహులు నాయుడు, జబ్బార్, గోవిందయ్య, లలిత లకు చెక్కులను పంపిణీ చేశారు.

# వాసవి, వనితాక్లబ్ ఆధ్వర్యంలో వైభవంగా సంక్రాంతి వేడుకలు





**బద్వేలు అర్బన్, జనవరి 13 (ప్రభాతవార్త ):**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం వాసవిక్లబ్ అధ్యక్షులు అనుమలశెట్టి సిద్దయ్య, వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మిల ఆధ్వర్యంలో వాసవి అపార్ట్ మెంటు వద్ద తెల్లవారుజామునుంచే బోగిమంటలు వేసి సంక్రాంతి పండుగ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలలో వాసవి అపార్ట్‌మెంటు అధ్యక్షులు పీవీఎస్.ప్రసాద్, సెక్రటరీ తుమ్మలపెంట సురేష్, ట్రెజరర్ కిశోర్‌కుమార్, ముచ్చర్ల సుధాకర్, ఆర్యవైశ్య వర్తకసంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, వాసవిక్లబ్ మాజీ అధ్యక్షులు చాటకొండు వెంకట సుబ్బయ్య, కొప్పరపు నాగేంద్ర, ప్రవీణ్‌తో పాటు పలువురు సంక్రాంతి పండుగ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం వాసవిక్లబ్ అధ్యక్షులు అనుమలశెట్టి సిద్దయ్య, వనితాక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మిలు మాట్లాడుతూ దక్షిణ భారత్‌లోని అన్ని రాష్ట్రాలలో హిందువులందరూ జరపుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి అని ,సంప్రదాయ పండుగలలో సంక్రాంతికి ఎంతో విశిష్టత, ప్రాముఖ్యత ఉందన్నారు. అన్ని పండుగలు సాధారణంగా జరుపుకుంటే సంక్రాంతి పండుగ మాత్రం సూర్యగమనం ఆధారంగా జరుపుకుంటారన్నారు. ఈ పండుగ నెల రోజుల ముందే మొదలవుతుందని, ప్రతి ఇంటి ముందే వేకువ జామునుంచే రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతారన్నారు. ఇంటిల్లిపాది మిగతా రోజులలో ఎక్కడ ఉన్నా సరే ఈ పండుగకు ఇళ్లలో వాలిపోతారని, పిండివంటల తయారీకి పండుగకు పది రోజుల ముందే పండుగ హడావుడి మొదలవుతుందన్నారు. ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైసాని సుమంత్, ముచ్చర్ల సుజాత, శిరీష, పద్మావతి, పత్తి రమాదేవి, కనమర్లపూటి శ్రీదేవితోపాటు పలువురు అపార్ట్‌మెంటు వాసులు పాల్గొన్నారు.

# నిరుపేద వైశ్యులకు వస్త్రాలు వితరణ



**బద్వేలు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:**

బద్వేలు పట్టణంలో అనేక సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముందస్తుగా నిరుపేద వైశ్యులు కూడా ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో శ్రీ సాయి వెంకటేశ్వర లాడ్జి మరియు కామన్‌బెడ్స్ యజమాని పబ్బతి హాజరత్, వారి సోదరుడు సత్యనారాయణల సహకారంతో వ స్త్రాల వితరణ కార్యక్రమం చేపట్టడం సంతోషకరమని, ఆవోపా అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, సెక్రటరీ సి.వి.నాగేశ్వరరావు, స్టేట్ ఉపాధ్యక్షులు చప్పరపు సుబ్బారావులు పేర్కొన్నారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆవోపా కమిటి ఆధ్వర్యంలో అనేకమంది నిరుపేద ఆర్యవైశ్యులకు వస్త్రాల వితరణతోపాటు పెన్షన్ ఉచిత మందులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్షులు నూకల రెడ్డెయ్య, సెక్రటరీ సి.వి.నాగేశ్వరరావు, స్టేట్ ఉపాధ్యక్షులు చప్పరపు సుబ్బారావులు మాట్లాడుతూ పబ్బతి హజరత్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిరుపేద ఆర్యవైశ్యులకు ఖరీదైన వస్త్రాలు అందివ్వడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు, ఆవోపా జాయింట్ సెక్రటరీ రాచపూడి వెంకటరత్నం, కేవి.సుబ్రమణ్యం, పైడిమర్రి సుబ్రమణ్యాంలు మాట్లాడుతూ ప్రతి నెలా ఆవోపా కమిటి ఆధ్వర్యంలో నిరుపేదలకు పెన్షన్, మందులతో పాటు అల్పాహారం అందజేయడం జరుగుతుందన్నారు. సంక్రాంతి పండుగకు పబ్బతి హజరత్ కుటుంబ సభ్యుల సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ వస్త్రాల వితరణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం పబ్బతి సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. ఆవోపా మహిళా మండలి సభ్యులు ధనలక్ష్మి, శ్రీరామ్ సుప్రజ, సురేష్‌లతోపాలు పలువురు పాల్గొన్నారు. అనంతరం ఉచిత హోమియో క్యాంపు నిర్వహించి మందులు అందించారు.

# జీవో 22 ను భోగి మంటల్లో దహించివేసిన తులసి రెడ్డి



**వేంపల్లి, జనవరి 13, ప్రభాతవార్త :**

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని జగన్ ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 1 వ తేదీన జారీ చేసిన జీవో 22 ప్రతిని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి భోగి మంటల్లో వేసి దహించి వేశారు. భోగి పండుగను కాంగ్రెస్ నాయకులు సోమవారం వేంపల్లి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండుగ అని, అందువల్లనే రైతు వ్యతిరేక జీవో 22 ప్రతిని భోగి మంటల్లో వేసి కాల్చివేశామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా వ్యవసాయ రుణాల మాఫీ, ఉచిత విద్యుత్ సరఫరా, ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా, సున్నావడ్డీ, పావలా వడ్డీ రుణాలు, జల యజ్ఞం ఇలా అనేక రైతు అనుకూల విధానాలు అమలు చేసిందన్నారు. కానీ దురదృష్ట వశాత్తూ తర్వాత వచ్చిన వైకాపా, టిడిపి ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని అమలు చేసింది.దీనివలన రైతుల జీవితాలలో సంతోషం కలిగిందని, కానీ దురదృష్ట వశాత్తూ జగన్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని యెత్తివేసే దురుద్దేశం తో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించాలని 2020 సెప్టెంబర్1 న జీవో 22 జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ,వామ పక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించిన కారణంగా మీటర్లు కొన్నప్పటికీ బిగించలేదు.ఆ జీవో అలాగే వుందన్నారు. అధికారం లోకి వస్తే జీవో 22 ను రద్దు చేస్తామని టిడిపి,జనసేన పార్టీలు హామీ ఇచ్చాయని, అధికారంలోకి వచ్చి 7 నెలలైనా జీవో 22 ను రద్దు చేయలేదన్నారు. అన్నదాత సుఖీ భవ పథకం క్రింద ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని టిడిపి కూటమి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందని, ఖరీఫ్ సీజన్ అయిపోయింది.రబీ సీజన్ కూడా అయిపోయింది.

ఇప్పటివరకు 20 రూపాయల ఆర్థిక సాయం కూడా చేయలేదన్నారు. అందువల్ల రైతుల ముఖాలలో సంక్రాంతి సంతోషం కనిపించడం లేదన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా నైనా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాలలో రూ.20వేలు వేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు రామ కృష్ణ, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,నాగరాజు, వినయ్, బద్రి వెంకటేష్, మహబూబ్ బాషా, సుబ్బ రాయుడు, వేమారాజా, వేమయ్య, మాధురీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వ నమోదు



**బద్వేలు ,జనవరి 13 ప్రభాతవార్త**

టిడిపి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని పలువురు సభ్యత్వ నమోదు చేసుకున్న విషయం విధితమే. కాగా సోమవారం బద్వేలు మండల యువ నాయకులు మన్నెం సుధాకర్ రెడ్డి, ఎల్ఎస్‌పి డ్యామ్ చైర్మన్ రమణారెడ్డిలు లక్ష రూపాయలు టిడిపి నియోజకవర్గ యువ నితీష్ రెడ్డికి అందించి శాశ్వత సభ్యత్వం పొందారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను సైతం అందిస్తున్న అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని పలువురు పార్టీ సభ్యత్వ నమోదుకు ముందుకు రావడం హర్షనీయమని ఈ సందర్భంగా రితేష్‌రెడ్డి పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పాద చారికి గాయాలు

**సుండుపల్లె, జనవరి13,ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ఇందిరానగర్ చర్చ్ సమీపంలో బొమ్మల నాగయ్య అనే వ్యక్తి రోడ్డుపై నడిచి వెళ్తూ ఉండగా ద్విచక్ర వాహనం వెనుక నుండి ఢీకొనిందని కుటుంబ సభ్యులు తెలియజేసారు. వివరాల మేరకు.. బొమ్మల నాగయ్య సుండుపల్లి నుండి తన స్వగ్రామమైన గల్లా వాండ్ల పల్లి కు నడిచి వెళుతూ ఉండగా శిద్దారెడ్డి గారి పల్లె కు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంతో వెనుక నుండి ఢీ కొట్టడంతో నాగయ్య తలకు తీవ్ర గాయమైందని తెలిపారు. అంబులెన్స్ సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## సంక్రాంతి పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలి

**బద్వేలు అర్బన్, జనవరి 13 (ప్రభాతవార్త ):**



సంక్రాంతి పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి సునీల్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగలో భాగంగా మొదటిరోజు అయిన సోమవారం బోగి పండుగ సందర్భంగా మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్, కడపజిల్లా టీడీపీ వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ కనమర్లపూటి ప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచపూడి సాయిక్రిష్ణతో పాటు పలువురి నాయకులను శాలువా, గజమాలతో సత్కరించి వారికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. తెలుగువారికి అతి పెద్ద పండుగ అయిన సంక్రాంతి పండుగను బంధువుల మధ్య చక్కగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం పలువురు నాయకులు, ఆర్యవైశ్యులు, రైతులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆమె సేవలను 'బ్రిక్స్' మెచ్చింది !



వారిది విశాఖపట్నం నాన్న రెహమాన్ లారీ డ్రైవర్, అమ్మ మదీనాబీబీ చికెన్ దుకాణం నడుపుతారు. పేద కుటుంబం నిరక్ష్యరాస్యులు అయినా ఆ తల్లిదండ్రులు ఎక్కడా వెనకడుగు వేయలేదు. పిల్లలను బాగా చదువుకోవాలని ప్రోత్సహించారు.. వారి కృషి ఊరికే పోలేదు. కుమార్తెల్లో ఒకరైన ఆయేషా ఆ కుటుంబప్రతిష్ఠను మరో స్థాయికి తీసుకెళ్లారు. బ్రిక్స్ దేశాల యూత్ సమ్మిట్లో పాల్గొని అందరి ప్రశంసలందుకున్నారు. తన ప్రస్థానం గురించి అడిగితే ఆమె ఇలా చెబుతారు..

మేం ముగ్గురమ్మాయిలం. అమ్మ నాన్న చదువు కోలేదు. మాకు సొంతిల్లు కూడా లేదు. కానీ నాన్న మమ్మల్ని చదువుకోవాలని నిరంతరం ప్రోత్సహించేవారు. ప్రభుత్వ స్కూళ్లలోనేచదివినా మాకు ఎలాంటిలోటూ రానిచేనచవారు కాదు. పెద్దక బిటెక్, రెండో అక్క ఎంబిఎ చదివారు. నేను విసయనగరం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో పిజి చదివా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పిహెచ్‌డి సీటు సాధించా. అంత పెద్ద చదువులు చదివించలేని అమ్మానాన్నలను కష్టపెట్టలేక ఫెలోసిప్‌తో సర్దుకుంటానని వారికి చెప్పి వచ్చా. అన్నట్లుగానే ఇప్పటికీ ఇంటి నుంచి డబ్బులు తీసుకోలేదు. నా ఫెలోసిప్ డబ్బులనే సరిపెట్టుకున్నా. పిహెచ్‌డి చేస్తున్నప్పుడే విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించాను దానికో నేపథ్యం ఉంది. డిగ్రీ చదువుతున్న సమయంలో ఫీజు రీలయంబర్స్ మెంట్ నిలిచిపోతే ఎబివిపి కార్యకర్తలు మా తరఫున పోరాడారు. నాకూ అలా అందరి తరఫున నిలబడాలని, నాయకురాలిగా ఎదగాలని అనిపించేది. సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చాక దానికో రూపం వచ్చింది. ఎబివిపి సభ్యత్వం తీసుకుని సంస్థాగత కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేదాన్ని. హెచ్‌సియూలో ఎబివిపిలో చేరిన ఏకైక ముస్లిం అమ్మాయిని నేనే. చదువుకుంటూనే యూనివర్సిటీ తరఫున పలు సామాజిక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నాను. మానవ హక్కులు, రుతుక్రమం సమయంలో పాటించాల్సిన శుభ్రత గురించి మురికివాడల్లో ప్రచారం చేశాను. మహిళా సాధికారత కోసం మిషన్ సహస్రి కింద పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అటు చదువునూ ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. ఇటీవల రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నేను మాత్రమే ఎంపికయ్యాను. యూత్ కమ్యూనిటీ సర్వీసెస్, వాలంటరీ వర్క్‌లపై నన్ను బ్రిక్స్ సదస్సు అభినదించింది. వివిధ విషయాలపై నా ప్రతిపాదనలను కేంద్ర మంత్రి రక్షా ఖాడ్సే కూడా ప్రశంసించారు. ఇంట్లో ముగ్గురూ ఆడపిల్లలే.. ఒక్క కొడుకు లేడని తలోకరకంగా మాట్లాడేవారు వాటిని పట్టించుకోకుండా నాన్న ప్రోత్సహించేవారు. సొంతంగా ఎన్జీవో ఏర్పాటుచేయాలని పిహెచ్‌డిలో చేరినప్పుడే నిశ్చయించుకున్నా.

# చినుకుల్లోనూ మెరుపులీనుతూ..



సీజన్ ఏదైనా.. ముఖం అందంగా మెరవాలనుకుంటాం. అయితే ఈ వర్షాకాలంలో తడిసినప్పుడు మేకప్ కరుగుతుంది. ముఖమంతా ప్యాచ్‌లుగా కనిపించడంతో ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మేకప్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలంటున్నారు నిపుణులు. చర్మాన్ని ఈ సీజన్‌లో పొడారనివ్వకుండా జాగ్రత్తపడాలి. వాతావరణం చల్లగా ఉందంటూ నీటిని తీసుకోకుండా ఉండకూడదు. శరీరానికి కావాల్సినంత నీటిని అందించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా తేమగా ఉంటుంది. ఇక మాయిశ్చరైజర్ విషయానికొస్తే మిగతా కాలాల్లో వాడే దానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఇది ముఖాన్ని జిడ్డుగా మారుస్తుంది. ఆ తరవాత ముఖంపై వేసే మేకప్‌నూ ప్రభావితం చేస్తుంది. బదులుగా నాణ్యమైన, నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకుంటే సరి. ఇది మేకప్‌కు మంచి బేస్ అవుతుంది. చినుకులు పడినప్పుడు కూడా ముఖంపై ప్యాచెస్‌లా కనిపించనివ్వదు. మస్కారా కూడా వాటర్‌ప్రూఫ్ అయితేనే మేలు. కళ్లకు పెట్టిన వెంటనే త్వరగా ఆరుతుంది. తడికి కరగకుండానూ ఉంటుంది. మేకప్ తీసేయాలనుకున్నప్పుడు గులాబీనీళ్లలోనో కొబ్బరినూనెలోనో ముంచిన దూదితో తేలికగా శుభ్రం చేయొచ్చు.

**పౌడర్ ఆధారితంగా...** ముఖ చర్మం మృదువుగా మెరిసేలా కనిపించడానికి ముందుగా వేసే ప్రైమర్ విషయంలో మ్యాట్ ఫినిష్ ఇచ్చేదాన్ని ఎంచుకోవాలి. మేకప్ చెరిగిపోకుండా ఇది నిలపగలుగుతుంది. అలాగే మేకప్‌లో క్రీమ్స్ వినియోగంకన్నా పౌడర్ వాడితే మంచిది. ఈ సీజన్‌లో లైట్ వెయిట్ లిక్విడ్ ఫౌండేషన్‌లో ముందుగా కొంచెం వదులుగా ఉండే పౌడర్ కలుపుకోవాలి. మందపాటి ఫౌండేషన్ బ్రష్‌తో తేలికపాటిలేయర్స్‌గా అప్లై చేయాలి. ఈ విధానంలో ముఖం తడిసినా ప్యాచెస్‌లా కనిపించదు. స

**తక్కువగా....** లిప్‌స్టిక్ గ్లాసీగా కనిపించేది కాకుండా మ్యాట్ లుక్ ఇచ్చేది తీసుకోవాలి. అనుకోకుండా చినుకుల్లో తడిసినప్పుడు ఇది చెరగకుండా, పెదవులకు న్యూట్రల్ టింట్ ఇస్తుంది. ఎక్కువ సమయ తాజాగా కనిపించేలానూ చేస్తుంది. అంతేకాదు, వర్షాకాలలో ఎంత తక్కువ మేకప్ వేస్తే అంత మంచిది. చెక్కిళ్లు, గడ్డం, ముక్కు చివర, కనుబొమల మధ్య మానరతం వాటర్‌ప్రూఫ్ కన్సీలర్‌ను బ్రష్‌తో కాస్తంత హైలైట్ చేయగలిగితే చాలు. చివరగా మేకప్ సెట్టింగ్ స్ప్రే తప్పనిసరి. ఇది మేకప్ కరగకుండా కాపాడుతుంది. చినుకుల్లోనూ మెరిసే మోము సొంతమవుతుంది.

# వారి గెలుపు వెనక పూర్ణిమ

**2014 ఏషియన్ క్రీడలు.. శ్వేతా చౌదరి షూటింగ్‌లో కాంస్యం గెలిచింది. అలా విజేతలను ప్రకటించగానే.. ఆమె భర్త నుంచి పూర్ణిమకి ఫోన్! కాల్ కనెక్ట్ అవ్వగానే భావోద్వేగంతో 'థాంక్యు' అనే చెప్పాక అతనికీ నోట మాట పెగల్లేదు. ఇంకోసారి హీనా సిద్ధూ బంగారు పతకం గెలిచినప్పుడూ అంతే! అయితే ఈ సారి హీనానే నేరుగా ఆ మెడల్‌ని తెచ్చి పూర్ణిమ మెడలో వేసింది. అసలు ఎవరీ పూర్ణిమ రమణ్ గోమ్‌దిర్? వీళ్ల గెలుపులో ఆమె పాత్ర ఏమిటంటే..**



ఇంట్లో ఎవరికీ క్రీడా నేపథ్యం లేదు. కానీ క్రికెట్ వస్తోందంటే పూర్ణిమ కుటుంబమంతా టివి ముందుకు చేరిపోతారు. ఇక బామ్మ సంగతైతే అసలు చెప్పనక్కర్లేదు. 80 ఏళ్ల వయసున్నా టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లనీ ఆసక్తిగా చూసేది. వాటిని ఆవిడ విశ్లేషిస్తోంటే పూర్ణిమ ఆసక్తిగా వినేవారు. అసలు బామ్మ నుంచే క్రికెట్‌పై ప్రేమ మొదలైందామెకు. ఈమె స్వస్థలం ఢిల్లీ. అహ్మదాబాద్, ఢిల్లీల్లో పెరిగారు. స్కూల్ క్రికెట్ టీమ్‌లో ఆడినా తరవాత కొనసాగించలేక పోయారు. కానీ ఆటలకు సంబంధించిన కెరియర్‌నే ఎంచుకోవాలన్నది పూర్ణిమ కల. కానీ ఇంట్లోవాళ్లకేమో తను వైద్యవిద్య చదివితే చూడాలని ఆశ. ఏం తోచక చూస్తోన్న పూర్ణిమకు ఆమె అంకుల్ ఫిజియోథెరపీ చదవమని సలహానిచ్చారు. అప్పుడైతే ఆటగాళ్లతో కలిసి పనిచేయొచ్చు. అమ్మానాన్నల కలా నెరవేతుందని బెంగళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నుంచి బ్యాచిలర్స్, మంగళూరులోని డా.ఎంవీ శెట్టి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నుంచి పిజి పూర్తి చేశారు.

**ఆట నేర్చుకుని మరీ..** అమ్మాయి.. పైగా బక్కపలచన. ఈమె ఎలా ఈ రంగంలో నెగ్గుకొస్తుంది. సహాధ్యాయులు ఎన్నోసార్లు తన ముందే ఈ సందేహాన్ని వెలిబుచ్చేవారు. కానీ పూర్ణిమ అవేమీ పట్టించుకోకుండా కష్టపడి చదివారు. చదువు పూర్తవడంతోనే తొలి అవకాశం తలుపు తట్టింది. 2010 కామన్‌వెల్త్ క్రీడల్లో పోటీపడుతోన్న సీఆర్‌పిఎఫ్ షూటింగ్ టీమ్‌కి 'స్పోర్ట్స్ ఫిజియో'గా పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ఆట సాధనలో భాగంగా, వ్యాయామం చేసేటప్పుడు క్రీడాకారులు గాయాల పాలు అవ్వడం చూస్తుంటాం కదా. అలా కాకుండా జాగ్రత్తలు సూచించడం, పొరపాటున ఏదైనా ప్రమాదానికి గురైనా త్వరగా కోలుకునేలా చూడటం వంటివి ఈమె విధులు. ఉత్సాహంగా బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో టెన్నిస్, రెజ్లింగ్.. ఇలా భిన్న క్రీడాకారులతో పనిచేసే అవకాశాలొచ్చాయి. అప్పుడే ఓ ఆలోచన తట్టింది పూర్ణిమకు. క్రీడాకారులకు సలహా ఇవ్వడం తేలికే. కానీ అవి వాళ్లకు నిజంగా ఉపయోగపడితేనే కదా ప్రయోజనం అనిపించింది. అది సాధ్యమవ్వాలంటే ఆట గురించి తెలిసుండాలి అనుకున్నా. అందుకే కోచ్‌ల దగ్గరికి వెళ్లి ఆటను నేర్పించమని అడిగా. కొత్తల్లో గాయాలు అవుతాయన్నా పర్లేదని చెప్పి మరీ నేర్చుకున్నా. అది ఆటగాళ్ల గురించి లోతుగా తెలుసుకునే వీలు కల్పించింది అంటారు పూర్ణిమ. ఈ తత్వమే ఆమెకు ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులతో పనిచేసే వీలు కల్పించింది.



**విజేతలుగా చేయాలని....** ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ (ఓజీక్యూ).. పూర్ణిమ పనితీరును గమనించి, తమతో కలిసి పనిచేయమని ఆహ్వానించింది. ఓజీక్యూ.. సత్తా ఉన్న క్రీడాకారురలను ఎంపిక చేసి, ఆరోగ్యకరమైన ఆహారం దగ్గర్నుంచీ కోచింగ్, అవసరమైన పరికరాలు అందించడం వరకూ అన్ని అంశాల్లో సాయం చేస్తుంది. తగిన శిక్షణనిచ్చి మెరికల్లా తీర్చిదిద్దుతుంది. ప్రకాశ్ పదుకోణ్, విశ్వనాథన్ ఆనద్, నీరజ్ బజాజ్, విద్యా షా వంటి ఎందరో ఈ సంస్థలో డైరెక్టర్లుగా ఉన్నారు. ఓజీక్యూతో కలిసి పూర్ణిమ 14 ఏళ్లుగా ఒలింపిక్స్ పారాలింపిక్స్ అభ్యర్థులకు శిక్షణలో సాయమందిస్తు న్నారు. మెడికల్‌సైన్స్ విభాగానికి అధిపతిగా సంబంధిత బృందాన్నీ నడిపిస్తున్నారు. శ్వేత ఏషియన్ క్రీడలకు సిద్ధమయ్యేటప్పటికి వెన్నునొప్పితో బాధపడుతోంది. హీనాకేమో గాయంతో సమస్య. వీళ్లే కాదు.. ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే మరెందరో క్రీడాకారులు వాటిని అధిగమించి పతకం సాధించినప్పుడు నేనే గెలిచా అన్నంత ఆనందం అనే పూర్ణిమ ప్రో టెన్నిస్ అకాడమీలోనూ సేవలందిస్తున్నారు. ఇంటర్నేషనల్ రగ్బీ టోర్నమెంట్‌కి డోపింగ్ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ట్రాన్స్‌స్టాడియా యూనివర్సిటీకి ప్రోగ్రామ్ డైరెక్టర్ కూడా.

# ఓటమి ఎరుగని నేత హసీనా..

**షేక్ హసీనా.. ప్రస్తుతం ప్రపంచమంతా వినిపిస్తోన్న పేరు. బంగ్లా జాతిపిత కూతురుగా ప్రపంచంలోనే అత్యధిక కాలం ఏలిన మహిళా దేశానేతగా. బంగ్లాదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన ఐరన్ లేడీగా.. ఎన్నో కీర్తికిరీటాల్ని సొంతం చేసుకున్న నాయకురాలు. నాన్న నమ్మిన్న సిద్ధాంతాలకు కట్టుబడి.. స్వదేశం కోసం ఆమె అలుపెరుగని పోరాటమే చేశారు!**

అది ఆగస్టు 15, 1975 ఢాకా నగరం అప్పుడే నిద్రలేస్తోంది. ఆకస్మాత్తుగా బుల్లెట్ల శబ్దం. అదెక్కడో కాదు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ ముజిబుర్ రెహమాన్ వ్యక్తిగత నివాసంలోనే. ఆర్మీ ఇంటిని చుట్టుముట్టిందని ఆ కుటుంబానికి అర్థమైంది. అంతా ఒక గదిలో దాక్కున్నారు. కాల్పులు నిలిచిపోయాయనుకుని ఆయన బయటకు వచ్చారు. వెంటనే ఆర్మీ అధికారులు ఆయన్ని చుట్టుముట్టి, బుల్లెట్ల వర్షం కురిపించారు. 18 తూటాలు శరీరాన్ని ఛిద్రం చేశాయి. ముజిబుర్ రక్తపు మడుగులో పడిపోయారు. కుటుంబంలో అందరూ చనిపోయారు. కానీ, ఈ మారణకాండ నుంచి ఆయన ఇద్దరు కూతుళ్లు తప్పించుకున్నారు. ఎందుకంటే వాళ్లిద్దరూ అప్పుడు జర్మనీలో ఉన్నారు. వారిలో ఒకరే బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా. బంగ్లాదేశ్ రాయబారి, తన కుటుంబ మరణవార్త వినిపించిన వెంటనే ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. అప్పటి నుంచీ హసీనా జీవితం మారిపోయింది. అలాంటి పరిస్థితుల నుంచి బంగ్లా ప్రధాని అయ్యేవరకూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు హసీనా. ఐదుగురు పిల్లల్లో పెద్దవారు హసీనా. 1947లో తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)లో జన్మించారు. తండ్రి అప్పటికే రాజకీయనాయకుడు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో చురుగ్గా ఉండేవారు. దీంతో పాకిస్థాన్ ప్రభుత్వం అనేకసార్లు ఆయన్ని అరెస్టు చేసింది. అందుకే హసీనా, ఆమె తోబుట్టువులకు అందరి పిల్లల్లా నాన్నతో కూర్చొని సరదాగా కబుర్లు చెప్పే అనుభూతులే లేవు.

తండ్రి ముజిబుర్, పాకిస్థానీ డిక్టేటర్ల గురించి చెప్పిన విషయాలూ, ఆయన్ను జైలుపాలు చేయడం..లాంటి పరిస్థితులు చిన్నారి హసీనాను ఆలోచింపజేసేవి. పాకిస్థాన్ మీద వ్యతిరేకతను పెంచాయి. ఢాకా యూనివ్సటీలో చదువుకునే రోజుల్లోనే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు హసీనా. 1967లో న్యూక్లియర్ సైంటిస్ట్ వాజీద్ మియాను పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అప్పటికి బంగ్లాదేశ్ ఉద్యమం మరింత బలం పుంజుకుని 1971లో భారత్ సాయంతో బంగ్లా స్వతంత్ర దేశంగా ఏర్పడింది.

.. ద్వేషం పెంచుకోలేదు!.. నాన్న బంగ్లా అధ్యక్షుడు అయ్యారు. అంతా బావుంది కదా అనుకుని జర్మనీలో ఉనన్న భర్త దగ్గరకు వెళ్లిపోయారు హసీనా. 1975 జులైలో కుటుంబమంతా తనను చూడ్డానికీ వచ్చారు. అయితే, అదే వాళ్ల చివరి చూపని అనుకోలేదామె. తరవాత నెలరోజులకే కుటుంబమంతా చనిపోయారన్న వార్త విన్నారు. తండ్రి మృత్యుబడిలోకి జరిగిపోయిన ఆ రాత్రి ఆమెకు ఎప్పటికీ పీడకలే. కానీ ఆమె దాన్నే తలచుకుంటూ కుమిలిపోలేదు. అది జరిగిన కొద్ది రోజులకే హసీనా ఢిల్లీ వచ్చి ప్రధాని ఇందిరాగాంధీని కలిశారు. భారత్‌లో ఆరేళ్లు నివసించారు. ఢాకాలో సైన్యం దేశాన్ని చేతుల్లోకి తీసుకుంది. దాంతో ఆమెకు ఇంటికి వెళ్లడమూ కష్టమైంది. కానీ ఎన్నో సంప్రదింపులతో ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టగలిగారు హసీనా. కుటుంబన్ని పొట్టనబెట్టుకున్న సమాజాన్ని ద్వేషించకుండా.. ఆ దేశానికే సేవ చేసేందుకు.. 1981లో నాన్న స్థాపించిన పార్టీ అవామీ లీగ్‌కు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. వేలమంది ప్రజలు ఎయిర్‌పోర్టు నుంచి ఇంటి వరకూ ఆమెకు స్వాగతం పలికారు. 15 పార్టీలను కూడగట్టి మిలిటరీ రెజీమ్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేశారు. 1983లో ఆర్మీ ఢాకా యూనివర్సిటీలోకి ప్రవేశించి విద్యార్థుల మీద కాల్పులు జరిపింది. దానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తోన్న హసీనాను ఆర్మీ కళ్లకు గంతలు కట్టి మరీ కస్టడీలోకి తీసుకుంది. ఇలాంటి పరిస్థితులు నిత్యం జరిగేవి. ఇలా ఎన్నో నిర్బంధనలు.. 19 సార్లు హత్యాయత్నాలూ.. హసీనాను ఏమీ చేయలేకపోయాయి.

# ప్రొద్దుటూరు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం

ప్రొద్దుటూరు జనవరి 13 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పరిధిలో రెండు అభివృద్ధి పనులను రద్దు చేయడమే కాకుండా మున్సిపల్ సాధారణ నిధులతోనే మార్కెట్ నిర్మాణం చేపట్టాలని కూటమి ప్రభుత్వం పంపిన లేఖతో ప్రొద్దుటూరు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమవుతోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో 61 కోట్లతో నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టామన్నారు. సుమారు 18 కోట్ల విలువైన మార్కెట్ నిర్మాణ పనులు వైసీపీ పాలనలోని పూర్తి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడు నెలల కాలంలో కేవలం రెండు కోట్లు అని మాత్రమే జరిగిందన్నారు. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం నుండి మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా మార్కెట్ నిర్మాణం చేసుకోవాలని లేక పంపడం అన్యాయం అన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో నిధుల కొరత ఉండడంతో మున్సిపల్ పాలనకే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి వివిధ రకాల పన్నుల ద్వారా ఒక సంవత్సరానికి రాబడి 45 నుండి 50 కోట్ల వరకు వస్తుందని అన్నారు ఈ ఆదాయం మున్సిపల్ పరిధిలోని ప్రజా అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయడానికి సరిపోతుందని తెలిపారు తిరిగి మున్సిపల్ ప్రజలపై భారం మోపే విధంగా మార్కెట్ నిర్మాణం చేపట్టం ఉండడం దారుణమన్నారు అంతే కాకుండా 160 కోట్లతో కాలువల ఆధునీకరణ 160 కోట్లతో కొత్త పైపులైన్ ఏర్పాటు పనులకు గత వైసిపి ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభమయ్యాయి అన్నారు కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ అనంతరం ఆ రెండు పనులు రద్దు చేస్తూ ప్రజలకు



అన్యాయం చేసిందని విమర్శించారు తక్షణమే స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రద్దు చేసిన పనులను తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు గతంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమృత పథకం ద్వారా త్రాగు నీటిని అందించేందుకు టిడిపి ప్రభుత్వంలో కొంత మేరకు పనులు చేసి నిలిచిపోయిన అమృత పథకంలో వైసీపీ ప్రభుత్వంతో తప్పించి పనులు పూర్తి చేసిన సంగతి గుర్తు చేశారు. అలాగే నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు అయ్యేలా ఎమ్మెల్యే వరద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి గుర్రం లావణ్య వైజయంతి వైసిపి నాయకులు నల్లదేశి జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిసిన చంద్రబాబు

బ్రహ్మంగారిమఠం, జనవరి 13 ప్రభాతవార్త

సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లును వేసి దగ్ధం చేసి నిరసన తెలిపి ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి ప్రజలకు హామీ ఇచ్చి ఇప్పుడు ప్రజలపై భారాలు మోపి బడుగు బలహీన ప్రజలపై భారాలు మోపి ప్రజల నడ్డి విడుస్తున్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి ప్రజల నడ్డి విరుస్తున్నారు ఎస్టీ ఎస్టీలకు గత ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నది నేటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్లు దూరం చేసే ప్రయత్నాలు ఉన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో



సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, కార్యకర్తలు మునయ్య, గురయ్య, శీను, కృష్ణ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బకాయిలు విడుదలపై ఏన్జివోలు హర్షం

కడప కార్పొరేషన్ జనవరి 13 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడంపై ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్ లు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు రూ.13 వేల కోట్లు లు విడుదల చేశారని తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కడప ఎన్జిఓ కార్యాలయంలో విలేకురుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ ఏన్జి జి వో అసోసియేషన్, ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. విద్యాసాగర్ ప్రభుత్వంతో చర్చించి పెండింగ్ ఉన్న డిమాండ్స్‌ను విడుదల చేయాలని సీఎం చంద్రబాబుతో కోరడం జరిగిందన్నారు. డి ఏ, సరండర్ లీవ్, 12 పి ఆర్ సి, క్వాంటాం పెన్షన్ వంటి డిమాడ్స్ సీఎం చంద్రబాబు పరిస్కారం చేస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వంకు వారధిగా ఉద్యోగస్తులు పనిచేస్తున్నారని కొనియాడారు. లబ్ధిదారులకు పథకాలు చేరవడంలో ఉద్యోగులది కీలకపాత్ర పోషి



స్తున్నారని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షులు టీ.తిమ్మారెడ్డి,బాల పుల్లయ్య, సిటీ అధ్యక్షులు కె చిన్నయ్య, కార్యదర్శి సైలెశ్వేర్ రెడ్డి, వాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య పాల్గొన్నారు.

# దేశ విదేశాల్లో నాట్యకులకు విశేష ఆదరణ

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త :

నాట్యకళకు దేశ విదేశాల్లో విశేష ఆదరణ లభిస్తోందని బిజెపి జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో నిర్వహిస్తున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవంలో సోమవారం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పులివెందుల వాసి అయిన మోహిద్దీన్ ఖాన్ గత 25 సంవత్సరాల నుండి ప్రొద్దుటూరు లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఎందరో చిన్నారులను నాట్యకళలో నిష్ణాతులను చేసి ఎందరో గొప్పవారు, రాజకీయ నాయకుల దగ్గర ప్రదర్శన ఇప్పించి వారికి మానసికోల్లాసం కల్పించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం యోగాకు ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ కల్పించిన రీతి గానే సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ఆదరణ కల్పించేందుకు కృషి చేస్తున్నారని సూచించారు. ప్రస్తుతం నృత్య కళను విదేశీయులు కూడా నేర్చుకోవడం గర్వకారణం అన్నారు. బిజెపి రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ రాయలసీమ ను కూచిపూడికి ప్రొద్దుటూరును కేంద్రంగా చేసేందుకు మోహిద్దీన్ ఖాన్ కృషి




చేస్తున్నారని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. రాయలసీమ సంగీత రత్న, నాట్య రత్న అవార్డు గ్రహీత లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణప్రదీప్ రెడ్డి, నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మోహిద్దీన్ ఖాన్, ఎస్వీడిసి కరస్పాండెంట్ హరి నారాయణ, నాట్య కళా ప్రపూర్ణ డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంత రామలింగ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

# భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం

సిపిఎం నాయకులు నిరసనలు.

మదనపల్లి, జనవరి 13 ప్రభాత వార్త

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయకపోతే బోగి మంటల్లో విద్యుత్ బిల్లులు కాలి పోయినట్టు, కూటమి ప్రభుత్వం ప్రజా ఆగ్రహంలో కొట్టుకుపోక తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ట్రూ ఆప్ చార్జీలను, పెంచిన కరెంట్ చార్జీలను రద్దు చేయాలని"స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని" అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సోమవారం అన్నమయ్య జిల్లా, మదనపల్లి పట్టణంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. అడ్డగోలుగా వివిధ రకాల విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలను 2022, 23, 24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైనది కాదని మండిపడ్డారు. దీంతో సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న చెప్పిన చంద్రబాబు నేడు చేస్తున్న పని ఏంటని ప్రశ్నించారు. అదేవిధంగా ఆదానితో ఒప్పందం పెట్టుకుని ఒక వైపున రైతులకు వివిధ వ్యా




పార సంస్థలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తుండటం తప్పు పట్టారు. విద్యుత్ భారాలతో రైతులపై మరింత భారం పడుతుందని అన్నారు. రాష్ట్ర మొత్తం మీద 16 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలను ప్రజల మీద మోపిందని ఆగ్రహించారు. ఇటువంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, సిపిఎం నాయకులు నాగరాజు ప్రభాకర్ మల్లికార్జున రమణ వెంకటేష్ సహదేవ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానం నందు ఘనంగా మకర జ్యోతి ఉత్సవ

బద్వేల్ అర్బన్, జనవరి 13 , ప్రభాత వార్త

బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్ నందు ఉన్న అయ్యప్ప స్వామి దేవస్థానం నందు మంగళవారం మకర జ్యోతి సందర్భంగా ఘనంగా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఉపాధ్యక్షులు వెంగళ జయ సుబ్బారెడ్డి మరియు కమిటీ సభ్యులు కొప్పరపు ప్రభాకర్ ఆవుల మునయ్య కొండపల్లి వెంకట సుభాష్ కుమార్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మకర జ్యోతి సందర్భంగా దేవస్థానం నందు వినాయక స్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ అయ్యప్ప స్వామి వార్లకు తెల్లవారుజాము నుండి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అయ్యప్ప స్వామికి ఘనంగా నెయ్యాభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అభిషేకం చేసిన నెయ్యిని అందజేస్తామని తెలిపారు. సాయంత్రం జ్యోతి దర్శనం అంగరంగ వైభవంగా కన్నుల పండగ నిర్వహిస్తామని తెలిపారు. కావున ఈ మకర జ్యోతి ఉత్సవాలలో అయ్యప్ప స్వామి భక్తులందరూ పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## వ్యక్తి అదృశంపై కేసు నమోదు

రామసముద్రం జనవరి 13ప్రభాతవార్త

మండలం మాలేనతం పంచాయతీ ఉప్పునెల్లి గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణ 80 కనిపించ లేదని అతని కుమారుడు ఆంజప్ప ఆదివారం పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ నెల ఆరవ తేదీన పెన్షన్ డబ్బులు తీసుకు వస్తానని రామసముద్రం వచ్చిన తన తండ్రి వెంకటరమణ తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా వెంకటరమణ ఆచూకీ తెలియలేదని ఆంజప్ప తన పిర్యాదు లో పేర్కొన్నారు. వెంకటరమణ అదృశంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.

## మొదలైన సంక్రాంతి సంబరాలు

దువ్వూరు, జనవరి 13, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు సోమవారం సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంక్రాంతి పండుగలో భాగంగా సోమవారం భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగను ఆహ్వానించారు. మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుమ పండుగ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కనుమ పండుగ సంధర్భంగా పాత దువ్వూరులోని శ్రీ కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలైన సీతారామ లక్ష్మణ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ గ్రామోత్సవం దువ్వూరు మెయిన్ రోడ్డు ద్వారా కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

## వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం

వాల్మీకిపురం జనవరి 13 ప్రభాతవార్త ః



శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణం అనంతరము శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి వారికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల సమర్పణ తదుపరి భక్తులకు అన్న సమర్పణ జరుగును. (ఇక నుండి పౌర్ణమి రోజున ఉ శ్రీ సత్య నారాయణ స్వామి వ్రతం, సాయంత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణము జరుగును. భక్తులు దయచేసి ఈ మార్పును అనుసరించమనవి.)

## తంబళ్లపల్లెలో ఘనంగా భోగి పండుగ



తంబళ్లపల్లె జనవరి 13 ప్రభాతవార్త ః

మండలంలో సోమవారం గ్రామీణ ప్రాంత ప్రజలు భోగి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. భోగి పండుగ సందర్భంగా ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు అందులో గొబ్బెమ్మలు అమర్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మారు మూల కుగ్రామాలలో సైతం భోగి పండుగ సందర్భంగా సాయంత్రం రైతులు పెద్ద ఎత్తున భోగి మంటలు వేసుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో మల్లికార్జున స్వామి మహిళా కళాకారుల బృందం భోగి మంటలు చుట్టూ కోలాటాలు, గొబ్బెమ్మ పాటలతో సందడి చేశారు. పిల్లలు, పెద్దలు భోగి మంటలు చుట్టూ చేరి చలి కాచుకున్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం పండుగ కోసం పూలు, పండ్లు, కూరగాయలు, ఇంటి సరుకులు ధరలు ఆకాశాన్ని అంటాయి. పండుగ సందర్భంగా చిన్నారుల నెతిన భోగి పండ్లు వేసి వారు అష్టైశ్వర్యాలు భోగభాగ్యాలతో అభివృద్ధిలోకి రావాలని పెద్దలు దీవించారు.

## 15 నుండి మఠం పిరయ్య స్వామి అరాధనోస్తవాలు

చిన్నమండెం జనవరి 13 ప్రభాతవార్త:



మండలంలోని చిన్నర్సుపల్లి గ్రామం మఠంలో వెలసిన పీరయ్య స్వామి 219 వ అరాధనోస్తవాలు ఈ నెల 15 వ తేదీ నుండి అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మఠాది పతి నాగలింగమయ్య స్వామి తెలిపారు. అప్పట్లో స్వామివారు సజీవసమాధి అయ్యారని అప్పటినుండి ఇప్పటివరకు స్వామివారి అరాధనోస్తవాలు వారి వారసులు నిర్వహించడం జరుగుతోంది.15 వ తేదీ సాయంత్రం పుష్పాలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు రాత్రి 7 గంటలకు రవాణా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిచే పిరయ్య స్వామి సుప్రభాతము పుస్తకావిష్కరణ జరగనున్నట్లు మఠాది పతి తెలిపారు.అనంతరం చెక్కబజనలు, ఆర్కెస్టా వివిధ సాముస్కృతక కార్యక్రమాలు వుంటాయి. 16 వ తేదీ మోలాలి జండా ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. ఈ వుస్తవాలకు వచ్చినభక్తులకు పెద్ద ఎత్తున అన్నదానకార్యక్రమం ఉంటుందన్నారు. కావున భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి అరాధనోస్తవాలలో పాల్గొనాలని మఠాదిపతి కోరారు.

## 15న పారువేట ఉత్సవాలు



కమలాపురం డిసెంబర్ 13 ప్రభాత వార్త

సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని కమలాపురం నగర పంచాయతీలో పాగేరు వంక సమీపాన బుధవారం నిర్వహించే పారువేట ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నీలం నరేంద్ర పేర్కొన్నారు. పారువేటలో నిర్వహించే కార్యక్రమ వివరాలను ఆయన పంచుకున్నారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు, కబడ్డీ, ముగ్గుల పోటీ, లెమన్ స్పూన్, రన్నింగ్ రేస్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని కంప పొదలను తొలగించి డాక్టర్తో చదును చేస్తున్నామని తెలిపారు.

## వెలుగు స్కూల్లో అన్నదానం



మదనపల్లి జనవరి 13 ప్రభాతవార్త.

మదనపల్లి రూరల్ మండలం, కోళ్ళ బైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్ట లోని వెలుగు సంస్థ నందు సోమవారం పిల్లలకు వృద్ధులకు అన్నదానం చేశారు. మదనపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్, రైటర్ రామ్మూర్తి వెలుగు సంస్థకు విచ్చేసి తన కుమార్తె స్వర్గీయ రేవతి జ్ఞాపకార్థం, వెలుగు కన్వీనర్ , వెలుగు సిబ్బంది, వృద్ధుల మధ్య ఆమె చిత్ర పటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వెలుగు చిన్నారులను, వృద్ధులను బన్నులు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రైటర్ రామ్మూర్తి, వెలుగు కన్వీనర్ ఆర్. భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్ యం.గీత, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యదర్శిగా సాకం నీలవర్ధన్ రెడ్డి

పులివెందుల, జనవరి 13, ప్రభాతవార్త :



వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యదర్శిగా సాకం నీలవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు వైసిపి అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం గ్రామానికి చెందిన సాకం నీలవర్ధన్ రెడ్డి వైసిపి లో కీలక నాయకుడిగా వ్యవహరిస్తూ గతంలో వైసిపి సోషల్ మీడియా సింహాద్రిపురం మండల ఇన్చార్జిగా నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్‌గా ఉన్నారు. గతంలో 2019 ,2024 ఎన్నికల్లో కీలకంగా పని చేసిన నీలవర్ధన్ రెడ్డి. వైసిపి అధిష్టానం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నా మీద నమ్మకంతో నాకు అప్పగించిన బాధ్యతలు నిక్కచ్చిగా నిర్వర్తిస్తానని నాకు ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, కడప ఎంపీ వై ఎస్ అవినాష్ రెడ్డికి, నియోజవర్గ ఇన్చార్జి వైయస్ భాస్కర్ రెడ్డికి, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి రెడ్డి శివ శంకర్ రెడ్డికి, సింహాద్రి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డికి ప్రతి ఒక్కరికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల కలయిక



బద్వేలు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త :

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము అన్నరీతిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. బద్వేలు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2005-06విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిననాటి విద్యార్థులు గెట్‌టు గెదర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులైన గంగన్న, రామసుబ్బయ్య, జయచంద్ర, వెంకటేశ్వర్లు, పిఈటీ రవితోపాటు మరికొంతమందిని ఆప్యాయంగా ఆహ్వానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్న పిల్లల్లా మారిపోయి జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే ఆనాడు మీరు నేర్పిన విద్యాబుద్ధులే కారణమని, గురువులకు తాము ఎంతో రుణపడిఉన్నామని చెప్పుకొచ్చారు. అనంతరం శాలువా, పూలమాల, జ్ఞాపికలతో ఉపాధ్యాయులను సన్మానించారు.

## కోడిపందాలు,పేకాట స్థావరాలపై ముమ్మర తనిఖీలు



సిద్ధవటం, జనవరి 13, ప్రభాతవార్త:

మండలంలోని పలు అనుమానితుల ప్రదేశాలలో సోమవారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ఆదేశాలతో ఇంచార్జ్ మండల ఎస్సై శివప్రసాద్ సూచన మేరకు రామస్వామి పల్లె, మాధవరం, జ్యోతి, నేకనాపురం గ్రామాల్లో అనుమానిత ప్రదేశాల్లో కోడిపందాల స్థావరాలపై విస్తృత గాలింపు చర్యలు పోలీసులు చేపట్టారు ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ పండుగ పేరుతో కోడి పందాలు పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠినమైన చర్యలు తప్పవని సంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడకూడదని గత ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కోడి పందేలు, జూదాలకు, పాల్పడిన వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని కోడి పందేలు జూదాలు పేకాట వంటి వాటిని ఆడిన ఆడించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్య తీసు కుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, ఎల్ శివ ప్రసాద్ రెడ్డి, కానిస్టేబుళ్లు రామ్ కుమార్, రాఘవేంద్ర, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పైపు పగిలి వృధాగా పోతున్న త్రాగునీరు

పండుగలో మహిళలకు తప్పని ఇబ్బందులు



సిద్ధవటం జనవరి13 ప్రభాతవార్త:

సిద్ధవటం మండలంలోని మాధవరం 1 గ్రామం రోడ్ నెంబర్16 నందు గత కొన్ని రోజులుగా మంచినీటి పైపు డామేజ్ కావడంతో రహదారి జలమయం అయిపోయి దారి పొడవునా నీరు ఉండడంతో ఆ ప్రాంత మహిళలు సంక్రాంతి వేడుకలలో గృహాలు ముందు నీరు ఉండడంతో మండిపడ్డారు కొన్ని రోజులుగా నీరు ప్రవహిస్తున్న సంబంధిత అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోలేదని త్రాగునీరు వృధా చేయవద్దని ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ఆచరణలో కానరావడం లేదని ఆ ప్రాంతమహిళలు తెలియజేశారు.మంచినీటి సమస్యపై గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీ నరసయ్యను సోమవారం వివరణ కోరగా రోడ్ నెంబర్ 16 నందు గత కొన్ని రోజులుగా పైపు డామేజ్ ఉన్న విషయం మా దృష్టికి వచ్చిందని ఆ ప్రాంతానికి ఇంజనీర్ అసిస్టెంట్ వెళ్ళాడని సంక్రాంతి వేడుకల్లో భాగంగా కూలీలు రావడంలేదని పండుగ అనంతరం గ్రామ సర్పంచ్ జానకి రామయ్య అధ్యక్షతన సమస్య పరిష్కారం చేస్తామన్నారు.

## కమలాపురంలో మొదలైన భోగి సంబరాలు

కమలాపురం జనవరి 13 ప్రభాత వార్త



సంక్రాంతి పండుగ సందర్భంగా కడప జిల్లా వ్యాప్తంగా భోగి పండుగ సంబరాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయాన్నే 5 గంటలకే భోగి మంటలు వేసి పండుగను ప్రారంభించారు. ఆట పాటలతో పిల్లలు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. భోగి పండుగను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. సంప్రదాయానికి పండగలు ప్రతి రూపాలుగా నిలుస్తాయని కాగా భోగి సంబరాలు కమలాపురం మండలంలో జరిగాయి.

## నిజాయతీకి మారుపేరు అశోక్

సుండుపల్లి, జనవరి13,ప్రభాతవార్త:

మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామం కురవపల్లి నివాసి దుర్గం. శ్రీలత ఆదివారం రోజున రాయచోటి నుండి తన సొంత గ్రామమునకు ఆటోలో వస్తుండగా ఆటో రాచంవాండ్ల పల్లి వద్ద ఉన్న సబ్ స్టేషన్ దగ్గర పొరబాటున శ్రీలత వద్ద ఉన్న పర్స్ కింద పడిపోయింది విషయాన్ని శ్రీలత సుండుపల్లి పోలీసు వారికి తెలియజేయగా పోలీసు వారుపోలీస్ విచారించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. రాయచోటి పట్టణానికి చెందిన అశోక్ ఆ మార్గంగా వస్తుండగా ఆ ప్రాంతంలో అతనికి పర్స్ దొరికింది పర్సులో ఉన్న ఫోన్ నెంబర్ తో శ్రీలతకు విషయం తెలియచేయగా పోలీసులు శ్రీలత పిలిపించి శ్రీలతకు చెందిన పర్స్‌ను అశోక్ ద్వారా అందజేశాడు. ఆ పర్స్‌లో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, వాటి విలువ సుమారు 4,50,000/ గా ఉన్నాయి. ఇంత విలువైన వస్తువులను తిరిగి శ్రీలతకు అప్పగించిన అశోక్ ను పోలీసులు అభినందించారు. విషయాన్ని సుండుపల్లి ఎస్సై తన పై అధికారులకు తెలియజేయగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ మరియు రాయచోటి రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీ వరప్రసాద్ సూచనల మేరకు సుండుపల్లి పోలీస్ లు, శ్రీలత పోగొట్టుకున్న సొత్తును తిరిగి నిజాయితీగా అప్పగించిన అశోక్ ని పోలీస్ స్టేషన్ కు పిలిపించి శాలువాతో సన్మానించి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుండుపల్లి ఎస్సై యం.శ్రీనివాసులు,ఏఎస్ఐ బ్రహ్మయ్య,హెడ్ కానిస్టేబుల్ బి డి నాయక్, కానిస్టేబుల్ ప్రవీణ్,రాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవం



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:

పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాల్లో సోమవారం గోదాదేవి, రంగనాయకుల కళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిచారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుని కళ్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరునికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణ వేదికపై శ్రీకృష్ణుడు, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఆశీనులను చేశారు. సుముహూర్తంలో భక్తజనులు తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ముత్యాల తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. పాతమార్కెట్లో లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. గోదాదేవి రంగనాయకుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి సుముహూర్తంలో కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదవినయోగం జరిగింది. స్థానిక హౌసింగ్ బోర్డుకాలనీలోని శ్రీలక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. గోదాదేవి రంగనాయకుల కళ్యాణాన్ని అట్టహాసంగా జరిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. హోమస్పేట లోని పాండురంగ స్వామి ఆలయం వద్ద కూడా ఘనంగా గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం అందించారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళం

సుండుపల్లె, జనవరి13, ప్రభాత వార్త :



మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ ఆరోగ్య పురం ఎన్‌జేఆర్ కాలనీలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ముదుంపాడు పంచాయతీలోని గోపాల కృష్ణా పురానికి చెందిన కావలి నాగార్జున, ఉష కుటుంబ సభ్యులు రూ.20,016లు నగదును అందజేసినట్లు ఆలయ అర్చకులు అమృనాయక్ తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరిస్తున్నారని అందులో భాగంగానే సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. దీంతో ఆలయంలో ద్వార స్తంభాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు. ఇంకా ఎవరైనా దాతల ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

## శిల్పారామంలో భోగిమంటలు



కడప కార్పొరేషన్ జనవరి 13 ప్రభాతవార్త:

శిల్పారామంలో ఈ ఏడాది సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సాంస్కృతి కార్యక్రమాలు వీక్షించడానికి అధిక సంఖ్యలో కడప నగరవాసులు తరలివస్తున్నట్లు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంక్రాంతి సం బరాలలో భాగంగా సోమవారం కడప శిల్పారావంలో సా.6 గం.లకు ప్రేక్షక వీక్షకుల నడుమ భోగి మంటలు వెలిగించారు. అనంతరం సాంస్క ృతిక కళావేదిక మీద చిత్తూరు జిల్లా చెందిన బైరెడ్డిపల్లి కళాతరంగని బృందం శాస్త్రీయ నృత్యలు, సినీ గీతాలు, జానపద గీతాలుకు డాన్సులు వేసి వీక్షక ప్రేక్షకులను అలరించారు. గోదావరి గట్టుమీద, సంక్రాంతి వచ్చింది అనే స్టెప్పులకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో శిల్పారాం పరిపాలన అధికారి శివప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన బాబు, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా భోగి పండుగ వేడుకలు



సిద్ధవటం జనవరి13 ప్రభాతవార్త:

మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు, గ్రామాలలో పెద్దలు, పిల్లలు, భోగి మంటలు వేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు పల్లె ప్రాంతాల్లో బంధుమిత్రుల సందడితో పల్లె ప్రాంతాలు జనసంద్రోహంతో కిక్కిరిసిపోయాయి మకర, కనుమ పండుగలకు ముగ్గుల పోటీలకు పల్లె ప్రాంతాల వాసులు ఏర్పాటు చేస్తున్నారు.

## భగ భగ మంటూ భోగి మంటలు

### చిన్నారులకు రేగిపండ్ల స్నానాలు...అలరిస్తున్న రంగవల్లులు

పులివెందుల, జనవరి 13, ప్రభాతవార్త :



హిందూ సాంప్రదాయం ప్రకారం సంక్రాంతి పండుగ ముఖ్యమైనది. సంక్రాంతి మూడు రోజులు పండుగ. రైతులు కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చిన సందర్భంగా ఈ పండుగను జరుపుకుంటారు. మొదటి రోజు భోగి,రెండో రోజు సంక్రాంతి,మూడో రోజు కనుమ అని జరుపుకుంటారు. భోగి రోజు భోగి మంటలు వేసి మంటలపై నీల్లు కాచుకొని చిన్నారులు పెద్దలు రేగి పండ్లతో స్నానాలు చేయడం ఆనవాయితీ. ఈ విధంగానే ఈ రోజు ప్రతి ఇంట్లో రేగుపండ్ల స్నానాలు చేశారు. ప్రతి ఇంటి వద్ద రెండవ రోజు సంక్రాంతిన పంట రాబడికి పూజ చేసి ఇష్ట దైవాన్ని పూజిస్తారు. కనుమ రోజు కోళ్ల పందాలు , టెంకాయల పందాలు ఆడుకుంటూ సరదాగా గడుపుతారు. మూడు రోజులు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి సంతోషంగా పండుగను జరుపుకుంటారు. సోమవారం మొదటి రోజూ ప్రజలు అంత భోగి పండుగ ను సంతోషంగా జరుపుకున్నారు.

## ఘనంగా భోగి వేడుకలు

రామసముద్రం జనవరి 13ప్రభాతవార్త .



పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజున జరుపుకునేది భోగి పండుగని అందులో బాగానే సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు భోగి పండుగను ఇళ్ళ ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి గంగిరెద్దుల విన్యాసాలు నడవ భోగి పండుగను ఘనంగా ప్రజలు జరుపుకున్నారు. భోగి అనే పండుగ " భుగ్ "భగ " అనే సంస్కృత పదం నుండి భోగి అనే పదం వచ్చింది. భోగం అంటే సుఖం. పూర్వం ఈ దినమే శ్రీ రంగనాథ స్వామీ లో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని దీని సంకేతంగా భోగి పండుగ ఆచరణలోకి వచ్చిందని మన పూర్వీకుల పురాణ గాధ. దక్షిణాయానికి చివరి రోజు గా భోగిని భావిస్తారు. దక్షిణాయంలో పడ్డ కష్టాలు బాధలను భోగి మంటలలో రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖ సంతోషాల ను ప్రసాదించాలని కోరుకుంటూ భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు తలపై రేగుపళ్ళ పోసి తలంటు స్నానాలు చేయించారు. అనంతరం పిండి వంటలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటాలు ఎగరవేయడంతోపాటు తిరుమలరెడ్డిపల్లె గ్రామం లో క్రికెట్ పోటీలను నిర్వహించారు.

## దరఖాస్తు గడువు పొడిగించండి

వేంపల్లి, జనవరి 13, ప్రభాతవార్త :

కడప జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయడానికి ఈనెల 8వ తేదీన బీసీ సేవా సహకార సంస్థ విడుద,ల చేసిన ప్రకటనలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ రావు ఓ ప్రకటనలో కోరారు వివిధ కార్పొరేషన్లకు చెందిన లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 8వ తేదీ నుండి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోమని ప్రకటనలో తెలిపారు అయితే ఈనెల 12వ తేదీ వరకు కూడా సంబంధిత వెబ్సైట్ అందుబాటులో లేదని దానివలన జిల్లాలో ఇప్పటివరకు ఎవరు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు అంతేకాక వివిధ కులాలకు చెందిన అభ్యర్థులకు వారి కులం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్ పొందుటకు ఈ గడువులో ఐదు రోజులు సెలవు దినాలు వచ్చినందున అభ్యర్థు లు అవసరమైన సర్టిఫికెట్ కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. అందువలన వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 30 తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించాలని ఆయన కోరారు. జిల్లాలో బ్రాహ్మణ కార్పొరేషన్ కింద కేవలం 9 యూనిట్లు కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు అయితే జిల్లాలో ఉన్న బ్రాహ్మణ అభ్యర్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వీటి సంఖ్యను పెంచాలని జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నట్లు తెలిపారు

## దాన గుణానికి మారుపేరు ఉపాధ్యాయ దంపతులు

వేంపల్లి, జనవరి 13, ప్రభాతవార్త :



దాన గుణానికి మారుపేరుగా వేంపల్లి కి చెందిన ఉపాధ్యాయ దంపతులు నిలుస్తునారు. స్థానిక పులివెందుల రోడ్డు లోని వైష్ణవి కాలనీలో నివసిస్తున్న ఉపాధ్యాయ దంపతులు సింగారెడ్డి నరసింహారెడ్డి, సుకన్య దంపతులు సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం 30 మందికి దుస్తులు పంపిణీ చేశారు. వీరు ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజ సేవ కూడా నిర్వహిస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. ఇటీవల వీరి మనవడు లక్షిత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాటశాలలో చదివిన విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. అంతేకాక సమాజసేవ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉదయ కిరణ్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, అనూష, రమ్యశ్రీ, తదితరులు ఉన్నారు.

### శ్రీకృష్ణాలయంలో ఘనంగా

## గోదా కళ్యాణమహోత్సవం

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ ఛైర్మన్ చల్లా దంపతులు

ప్రొద్దుటూరు, జనవరి 13, ప్రభాతవార్త

ధనుర్మాసం చివరలో భోగి పర్వదినం సందర్భంగా నిర్వహించే గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవాన్ని సోమవారం స్థానిక శ్రీకృష్ణాలయంలో ఛైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్, గండి ఆంజనేయులు యాదవ్ మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారకముందే ఆలయంలోని రాధాకృష్ణుల విగ్రహాలకు, వేణుగోపాలస్వామి మూలవిరాట్టులకు ప్రత్యేక గోక్షీర, పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై లోక కళ్యాణార్థం గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ దంపతులు ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పౌర్ణమి సందర్భంగా చల్లా ఆధ్వర్యంలో అన్నదానం

పౌర్ణమి సందర్భంగా టిడిపి బిసి నాయకులు, శ్రీకృష్ణాలయ పాలకమండలి ఛైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక టూ టౌన్ బైపాస్ రోడ్డులో వెలసిన చిన్నమ్మ తల్లి పెద్దమ్మ తల్లి ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 300 మందికి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు చల్లా రాజగోపాల్ యాదవ్ సేవా నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు చల్లా అభిమానులు మిత్రులు పాల్గొన్నారు.



## వాడవాడలా భోగి మంటలు

పీలేరు జనవరి 13 ప్రభాతవార్త ః



నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పీలేరు కలికిరి వాల్మీకిపురం గుర్రంకొండ కలకడ కె.విపల్లిలలో భోగిమంటలను పట్టణ ప్రాంతాలు వాడవాడలా వేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సంబరాలను అంబరాన్ని అంటే ఎలా నిర్వహించుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో సోమవారం వేకువ జామున నిద్ర లేచి ఇండ్లలోని పాత వస్తువులతో భోగి మంటలు ఏర్పాటు చేసుకుని మంటల మధ్య సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ మంటలలో గత ఏడాది నుంచి ఉన్న పాత వస్తువులు అన్నింటిని మంటలు వేసి కొత్త సంవత్సరానికి నాంది వెలుగుతో సంబరాలు నిర్వహించుకోవడం ఆనవాయితుగా వస్తున్న ఆచారం.ఈ క్రమంలోనే ఇండ్లలోని ప్రతిపాద వస్తువును మంటలలో వేసి దహనం చేశారు.అనంతరం భోగి మంటల్లో వేడినీళ్ల ఏర్పాటు చేసుకుని ఇంటిళ్లపాది తలంటు స్థానాలు చేసుకొని పూజలు నిర్వహించుకున్నారు.

## ఎర్రచందనం స్వాధీనం: 12 మంది అరెస్టు



పుల్లంపేట: జనవరి 13 (ప్రభాతవార్త)

మండలం అనంతసముద్రం అటవీ ప్రాంతంలోని నకతిరీగలు గట్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 12 మంది అరెస్టు చేసినట్లు రాజంపేట డిఎస్పి సుధాకర్ విలేకరుల సమావేశంలో సోమవారం వెల్లడించారు. సుమారు ఎనిమిది లక్షల రూపాయలు విలువైన28 ఎర్రచందనం దుంగలను పట్టుకొని పుల్లంపేట పోలీస్ స్టేషన్ తరలించినట్లు వివరించారు. ఈ విలేకరులసమావేశంలో డిఎస్పీతోపాటు రాజంపేట రూరల్ బివి రమణ నందలూరు ఎస్సై వెంకటేశ్వర్లు పుల్లంపేట మోహన్ కుమార్ గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య భోగి మంటలు



పీలేరు జనవరి 13 ప్రభాతవార్త ః

సంక్రాంతి పండుగ పర్వదినాల సందర్భంగా మొదటి రోజు భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రజలు భోగభాగ్యాలకు ప్రతీకగా చెప్పుకునే భోగి పండుగన పురస్కరించుకొని సోమవారం ప్రజలు తమ ఇళ్ళ ముందు భోగి మంటలు వేసుకుని సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పీలేరు పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయ బృందం స్థానిక ఎస్వి డీలక్స్ రోడ్ లో భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వంగిమళ్ళ రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం, పోతం శెట్టి రమేష్, కృష్ణమూర్తి, రహత్ బాష, సుధాకర్ బాబు, అక్రం బాష, రాజేంద్ర, చంద్రమోళి, గఫార్ సాహెబ్, కరే ముల్లా తదితరులు పాల్గొన్నారు.

## శివోహం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 13, ప్రభాతవార్త:

శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో భాగంగా పట్టణానికి చెందిన గాండ్ల సంతోష్ కుమార్, మాధవి దంపతుల సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 800 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఛైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తాము నిర్వహించే ఈ అన్నప్రసాద సేవకు దాతల నుండి స్పందన ప్రశంసనీయమన్నారు. ప్రతి వారం దాతల పేర్లను ప్రస్తావించడం వలన మరింత మంది దాతలు ముందుకు వస్తారనే తప్పా మరో ఉద్దేశ్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షులు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, విష్ణునారాయణ, విజయకుమార్, వెంకటేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి, భాస్కర్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

### కనుమ పోలేరమ్మకు

## రజిత హస్తాభరణాలు వితరణ

బ్రహ్మంగారి మఠం, జనవరి 13 ప్రభాతవార్త:

జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి నిప్పు తెచ్చిన గ్రామ దేవత కోరిన వారి కోర్కెలు తీర్చే ఇలవేల్పు శ్రీ కనుమ పోలేరమ్మ వారికి మైదుకూరు మండలం కోనాయపల్లి గ్రామ వాస్తవ్యులు పంజాగాల్ల బాలయ్య ధర్మపత్ని పోలమ్మ వారి కుటుంబ సభ్యులు సుమారు 150000 లక్ష యాభై వేల రూపాయల విలువగల రజిత హస్తాభరణాలు కానుకగా సమర్పించారు ఈ హస్తముద్రికలను దేవస్థాన ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, అర్చకులు పూజారి ప్రసాద్ దేవస్థాన సిబ్బంది సుబ్బరాయుడు సమక్షంలో అమ్మవారికి అలంకరించారు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి అమ్మవారి వివిధ ప్రసాదాలను అందజేశారు.



## భర్తతో కాపురం చేయాలని ఆదేశాలున్నా ధిక్కరించిన భార్య భరణానికి అర్హురాలే

### (సుప్రీం కోర్టు కీలక తీర్పు)

బద్వేలు లీగల్, జనవరి 13 ప్రభాతవార్త:

భార్యాభర్తలకు సరిపడక న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భర్తతో కాపురం చేయాలన్న న్యాయస్థానం యొక్క ఆదేశాలను భార్య ఉల్లంఘించినప్పటికీ ఆమె భరణం పొందటానికి అర్హురాలే అని భారత అత్యున్నత న్యాయస్థానం ఓ వ్యాజ్యములో ఈ కీలక తీర్పును వెలువరించింది. అయితే న్యాయస్థాన ఆదేశాల ఉల్లంఘనకు సహేతుకమైన కారణాలు ఉండి తీరాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కలిసి దాంపత్య జీవనపు హక్కును భర్తకు పునరుద్ధరిస్తూ కోర్టు ఉత్తర్వు జారీ చేసిన తరువాత కూడా భార్య అత్త గారింటికి రానందున మనోవర్తి కోరే హక్కును ఆమె కోల్పోతుందని పలు హైకోర్టులు తీర్పునిచ్చిన విషయాన్ని కూడా ధర్మాసనం విశదీకరించింది. నేర శిక్షాస్మృతిలోని సెక్షన్-125(4) ప్రకారం అటువంటి తీర్పులు సమంజసమేనని స్పష్టం చేసింది. కలిసి జీవించాలన్న న్యాయస్థాన ఆదేశాలను సహేతుకమైన ప్రత్యేకమైన పరిస్థితుల్లో భార్య తిరస్కరించి ఉల్లంఘించినప్పటికీ ఆమె మనోవర్తి హక్కుకు నేర శిక్షాస్మృతిలోని సెక్షన్-125 భద్రత కల్పిస్తోందని ఉన్నత న్యాయస్థాన ధర్మాసనం (సిజెఐ) తీర్పులో విశదీకరించింది. జార్ఖండ్‌కు చెందిన భార్యాభర్తలకు సంబంధించిన ఓ వ్యాజ్యములో భారత అత్యున్నత న్యాయస్థానం ఈ కీలక తీర్పును వెలువరించింది.

## ఆకేపాటి గోపాల్ రెడ్డి ఫౌండేషన్ చే పేదలకు అన్నదానం..వస్త్ర దానం..



రాజంపేట, జనవరి 13, ప్రభాతవార్త

రాజంపేట మండలం ఆకేపాడు గ్రామంలో దివంగత శ్రీ ఆకేపాటి గోపాల్ రెడ్డి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం, పురుషులకు చొక్కా పంచే టవలు, మహిళలకు చీరలు పంపిణీ. పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ జి ఎన్ నాయుడు, మండల అధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, ఆకేపాటి గోపాల్ రెడ్డి ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి ,మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రహ్మణ్యం నాయుడు, రైల్వే కోడూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జిఎం నాయుడు మాట్లాడుతూ ఆకేపాటి గోపాల్ రెడ్డి తనకు ప్రాణ స్నేహితుడని ఆయన జ్ఞాపకార్థం ఆగేపాడు సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పురుషులకు బట్టలు పంపిణీ చేయడం అన్నదానం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

### వీధుల్లో భోగి మంటలు

## ఊరువాడ పండుగ సందడి

మైదుకూరు,జనవరి 13, ప్రభాతవార్త:



పిల్లలు పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. మైదుకూరు పట్టణంలోని మాధవరాయ ఆలయానికి పెద్ద ఎత్తున తరలివెళ్లి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.సంక్రాంతి కోసం నగరవాసులు స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో కుటుంబ సభ్యుల్లో సందడి నెలకొంది హిందువులు జరుపుకునే పండుగల్లో సంక్రాంతి పెద్ద పండుగ, నెల రోజుల ముందు నుంచే పల్లెలలో ఎక్కడ చూసినా కొత్త అల్లుళ్లతో కుటుంబ సభ్యులు ఆనందం సంతోషం వెల్లు విరుస్తుంటుంది. పండుగ సంబరాలు కనిపిస్తుంటాయి. ఈ పండుగను మొదటి రోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి, మూడవరోజు కనుముగా జరుపుకుంటారు.

### త్రి పాత్రాభినయంలో

## రాణిస్తున్న పీవీఎస్ లక్ష్మి

పీలేరు, జనవరి 13 ప్రభాతవార్త ః



మహిళలు అసాధారణ ప్రతిభతో రాణిస్తూ సమాజంలో తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకుంటారు. పీలేరుకు చెందిన పీవీఎస్ లక్ష్మి కూడా అదే కోవకు చెందుతారు. ఈమె తొలుత యోగా రంగంలో గుర్తింపు తెచ్చుకుని, సేవారంగం, రాజకీయంగా రాణించి తనకంటూ ఒక గుర్తింపు సంపాదించున్నారు. ఏ బిఈడి వెంమే (యోగా) చదివిని ఈమె ఏదోక రంగంలో రాణించాలని ఆలోచిస్తూ ఉండేది. ఈ క్రమంలో యోగాపై ఆసక్తి పెంచుకుని 2002లో గాలో, డిప్లమో కోర్సులో చేరి ప్రావీణ్యత సాదించాను. నేర్చుకున్న యోగా విద్యను పది మందికి తెలియచెప్పాలనే ఉద్యేశంలో నేటి వరకు వేల సంఖ్యలో నిర్వహించారు. పతంజలి మహిళా రాష్ట్ర అధ్యక్షురాలుగా పని చేశారు. యోగ చేయడంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తూ వస్తున్నారు. తాజగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రశంసా అవార్డు అందుకున్నారు.

మహిళా సాధికారత లక్ష్యంగా మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని లక్ష్యంలో 2002లో షీ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. అంగవైకల్య డెవలెప్మెంట్, యోగా స్వచ్ఛంద సంస్థ, యోగా పోటీలు, థెరపీ, మానవ జబ్బులు ఆవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళా సాదికారతకు కృషి చేస్తూ వస్తున్నారు.

యోగా గురువుగా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలుగా మంచి గుర్తింపు పొందిన ఈమె రాజకీయాల వైపు కూడా అడుగులేసి రాణించారు. 20.05.2011 మధ్య కాలంలో ఈమె పీలేరు జడ్పిటీసీగా పోటీలో నిలిచారు. త్రిముఖ పోటీ నెలకొన్న సందర్భంలో కూడా తెదేపా అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో విజయం సాదించారు. తనకు రాజకీయ అనుభవం లేకపోయినా రూ.కోటి నిధులు తెప్పించుకుని పీలేరు మండల అభివృద్ధి కార్యక్రమాలు చేయించారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రస్తుతం మనిషి అనేక పని ఒత్తిడి కారణంగా తొందరగా జబ్బుల బారిన పడుతున్నాడు. మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఆసుపత్రులకు వెళ్లకుండా ఇంట్లోనే జబ్బులు నయం చేసుకునే ఒకే ఒక ఆయుధం యోగా దైనందిన జీవితంలో ఇది ఒక భాగం కావాల్సి న అవసరం ఏర్పడింది.

